క్లుప్తంగా

ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలి



వినతి పత్రం అందజేస్తున్న ఆదర్శ రైతులు

కట్టంగూర్ : ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతూ కట్టంగూర్ మండలంలోని ఆదర్శ రైతులు సోమవారం నార్కట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గండమల్ల అంతయ్య, బెజవాడ రామకృష్ణ, పెద్ది వెంకన్న, ఊట్కూరి యాదయ్య, యర్కల సైదులు, పోగుల నరేందర్, రేకల భిక్షం పాల్గొన్నారు.

సెప్టెంబర్ 4 వరకు దోస్త్ స్పెషల్ అడ్మిషన్లు

నకిరేకల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో దోస్త్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అడ్మిషన్లు పొందేందుకు సెప్టెంబర్ 4వ తేదీ వరకు ప్రభుత్వం చివరి అవకాశం కల్పించిందని నకిరేకల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. బీఏ, బీకాం కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్, బీఎస్సీ, బీజెడ్‌సీ కోర్సుల్లో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్లు పొందాలన్నారు.

అధికార ప్రతినిధిగా రవిచంద్ర



నకిరేకల్ : భువనగిరి పార్లమెంట్ అధికార ప్రతినిధిగా నకిరేకల్ నియోజకవర్గంలోని రామన్నపేటకు చెందిన మేడి రవిచంద్ర నియామకం అయ్యారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ తనమీద నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మాదగోని నరసింహకు నివాళి

చండూరు : మండలంలోని బంగారుగడ్డ గ్రామంలో సోమవారం సీపీఐ నాయకుడు మాదగోని నరసింహ 24వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పాల్గొని నరసింహ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఎర్ర జెండాలతో ర్యాలీ నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్, జిల్లా సమితి సభ్యుడు నలపరాజు రామలింగయ్య, మాజీ జెడ్పీటీసీ మాదగోని విజయలక్ష్మి పాల్గొన్నారు.

పురుషోత్తమాచారికి ఘన సన్మానం



పురుషోత్తమాచారిని సన్మానిస్తున్న పెన్షనర్లు


రామగిరి(నల్లగొండ): నల్లగొండకు చెందిన డాక్టర్ పురుషోత్తమాచారి జాతీయ ఉత్తమ సినీ విమర్శకుడి అవార్డుకు ఎంపిక సందర్భంగా ఆయనను నల్లగొండ మండల శాఖ పెన్షనర్లు సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, మారోజు కేశవరాచారి, పి.నాగేశ్వరరావు, జెల్లా శ్రీశైలం, రంగయ్య, ఆంజనేయులు, సత్యం రమేష్, డి.వెంకటేశ్వర్లు, జీవీఆర్, ప్రసాద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కనగల్ : మండల కేంద్రానికి చెందిన నక్కల గాయత్రి(10) కడుపు నొప్పితో బాధపడుతూ సోమవారం మృతిచెందింది. ఇదే గ్రామానికి చెందిన బొడ్డుపల్లి భద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ సోమవారం పరామర్శించి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఎంపీటీసీ యేరేడ్ల సరస్వతిసుధాకర్‌రెడ్డి, మండలి పరమేష్, నక్క సైదులు, ఎటేల్లి సైదులు, మండలి చంద్రయ్య, ఉపేందర్‌గౌడ్, క్రాంతి, గిరి, కోటేష్, రవి, వర్షిత్ తదితరులున్నారు.

నర్రా రాఘవరెడ్డి స్ఫూర్తితో రక్తదానం

కట్టంగూర్ : నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన గోవిందమ్మకు అత్యవసరంగా రక్తం అవసరం ఉండగా సోమవారం కట్టంగూర్ మండలంలోని చెర్వు అన్నారం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు గడగోజు రవీంద్రాచారి రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి స్ఫూర్తితో తాను ఇప్పటికే 22 మార్లు రక్తదానం చేశానని తెలిపారు.




రక్తదానం చేస్తున్న గడగోజు రవీంద్రాచారి

గాంధీనగర్‌లో వసతులు కరువు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు



గాంధీనగర్‌లో బురదమయంగా ఉన్న ఓ వీధి



కాలనీకి వెళ్లే దారిలో ధ్వంసమైన కల్వర్టు

కట్టంగూర్ : కట్టంగూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ (జంగాల కాలనీ)కు వెళ్లే దారి పొడవునా గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని కల్మెర రోడ్డు వెంబడి కిలోమీటర్ దూరంలో ఉన్న గాంధీనగర్‌లో మౌలిక వసతులు కరువై కాలనీ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బేడ బుడిగ జంగాలతోపాటు ఇతర సంచార జాతులవారు బతువుదెరువు కోసం 15 సంవత్సరాల క్రితం ఇక్కడకు వచ్చి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. కాలనీలో కనీస వసతులైన సీసీ రోడ్లు, వీధిలైట్లు, డ్రెయినేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డుపైనే నిలుస్తున్న నీరు

గాంధీనగర్ కాలనీలో 150 కుటుంబాలకు పైగా జీవనం కొనసాగిస్తున్నారు. గాంధీనగర్‌కు వెళ్లే రోడ్డు సుమారు కిలోమీటరు దూరం ఉండగా బాట పొడవునా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో నిత్యం ఈ దారిగుండా వెళ్లే రైతులు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు రాకపోకలు కొనసాగించేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో ఈ దారిగుండా వెళ్లేందుకు కాలనీ ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. సీసీ రోడ్డు నిర్మించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాటకు ఇరువైపులా ఉన్న పొలాల నీటితోపాటు కల్వర్టు వద్ద ఏర్పాటు చేసిన సిమెంటు గూనలు పగిలిపోవడంతో నీరంతా బాటపై చేరుతోంది. బాట పక్కనే ఉన్న కాలువను కొంతమంది రైతులు పూడ్చివేయడంతో ఎప్పుడూ పొలాల నీరు దారిపై నిల్వ ఉండి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఆటోల్లో పిల్లలను పాఠశాలకు పంపే పరిస్థితి లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి గాంధీనగర్‌లో మౌలిక వసతులు కల్పించి సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన మట్టిరోడ్డు పనులు

గాంధీనగర్ కాలనీ ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లగా అంతర్గత మట్టిరోడ్డు నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలను సంవత్సరం క్రితం మంజూరు చేశారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కాలనీలో ప్రధాన వీధులు మూడు ఉండగా ఒక్క వీధిలోనే మట్టిపోసి మిగతా వీధుల్లో మట్టిపోయక పోవడంతో రాకపోకలకు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలి



గాంధీనగర్‌లో డ్రెయినేజీలు, సీసీ రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. కల్మెర రోడ్డు నుంచి గాంధీనగర్ వరకు బాట పై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. కాలనీకి రూ.5లక్షలు మంజూరు చేసినా అధికార పార్టీ నాయకుల వర్గపోరుతో పనులు నిలిచిపోయాయి. బాట అధ్వానంగా ఉండడంతో ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. వర్షాకాలంలో ఈ దారిగుండా వెళ్లేందుకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు చొరవచూపి సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలి.

– శిరిశాల రాము, గాంధీనగర్, కట్టంగూర్

మల్లన్నసాగర్ తరహాలో పరిహారానికి కృషి



వట్టిపల్లిలో మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి

మర్రిగూడ : శివన్నగూడ రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు, ముంపు గ్రామస్తులకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మల్లన్నసాగర్ తరహాలో పరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామని టీపీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం దామెరభీమనపల్లి, వట్టిపల్లి, మర్రిగూడ, రాజాపేటతండాల్లో ప్రజా చైతన్య యాత్ర 13వ రోజుకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో భాగంగా వట్టిపల్లిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్, యూత్ అధ్యక్షుడు బేత వెంకటేష్‌యాదవ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బన్సిలాల్, నక్క తిరుపతయ్య, మాదగోని కృష్ణయ్య, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లెం యాదగిరిరెడ్డి, శ్రీనునాయక్, మేకల నర్సింహారెడ్డి, రఘునందన్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ఇడగోని కృష్ణయ్య, కొట్టం శ్రీను, సిద్ధపురం జంగయ్య, సిరిపంగి శ్రీనివాస్, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు సంఘటితంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారి విద్యాసాగర్

కేతేపల్లి : రైతులు సంఘటితమై వ్యవసాయ రంగంలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నకిరేకల్ హార్టికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్ అన్నారు. సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అస్తిత్వ వెల్ఫేర్ ఫౌండేషన్ సహకారంతో కేతేపల్లి రైతువేదికలో నూతన రైతు ఉత్పత్తి దారుల సంఘం ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను వినియోగించుకోవాలన్నారు. పంటల ఉత్పత్తులను దూర ప్రాంతాలకు అమ్మడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ పంకజ్‌మాల్, ఎంఏఓ పురుషోత్తం, ఏఈఓ ఎం ఉమేష్, జి వెంకటయ్య, బుచ్చయ్య, వెల్ఫేర్ సభ్యులు కావ్య, జయంత్‌కుమార్, సుష్మ, శ్రీకళ, చంద్రశేఖర్, వెంకట్, గాయిత్రి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



సభ్యత్వం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కేతేపల్లి : పాత పెన్షన్ విధానాన్ని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టి నర్సింహమూర్తి, మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి మధు, ఆర్ రఘు, శ్రీధర్, చంద్రశేఖర్, రాకేష్‌కుమార్, శ్రీనివాస్, వేణుగోపాల్, జయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో ఒకరికి డెంగ్యూ

మునుగోడు : మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కగూడెంకు చెందిన ఓ యువతి డెంగ్యూ బారిన పడింది. మేకల శ్రీశైలం కుమార్తె హైదరాబాద్‌లో ఎల్‌ఎల్‌బీ చదువుతోంది. మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో శనివారం తల్లితండ్రుల వద్దకు వచ్చింది. వైద్య పరీక్షలు చేయించుకోగా డెంగ్యూ అని తెలడంతో గ్రామ కార్యదర్శి స్థానిక అధికారులకు, వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. ఎంపీడీఓ ఆర్. భాస్కర్ గౌడ్, వైద్యాధికారి ఎండీ అజార్ యువతి ఇంటి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని మురికి కాల్వను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఫాగింగ్ చేయించాలని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు.

నకిరేకల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



మాట్లాడుతున్న దైద రవీందర్

నకిరేకల్ : నకిరేకల్ నియోజకవర్గంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ పార్టీ నేత దైద రవీందర్ అన్నారు. నకిరేకల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నకిరేకల్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన వ్యక్తి బీఆర్ఎస్‌లో వెళ్లాడని.. మరోసారి ఆ తప్పు పునరావృతం కాకుండా అధిష్టానం చూసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉన్న తనకే పార్టీ అధిష్టానం టికెట్ కేటాయిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గార్లపాటి రవీందర్‌రెడ్డి, షేక్ జానీ, పాషా, పోతుల యాదగిరి, రియాజ్‌ఖాన్, చెనగాని రాజశేఖర్, వంటిపాక ప్రసాద్, నర్సింగ్ మహేష్, చెరుపల్లి సైదులు, జానీ, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ పొందేందుకు కరాటే దోహదం



కేక్ కట్‌చేస్తున్న ప్రిన్సిపాల్, కరాటే మాస్టర్లు

మునుగోడు : శత్రువులు దాడి చేసిన సమయంలో ఆత్మ రక్షణ పొందేందుకు, శారీర దారుడ్యానికి కరాటే దోహద పడుతుందని శాంతినికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ నన్నూరి సత్తిరెడ్డి అన్నారు. మండలంలోని గూడపూర్ గ్రామంలో గల శాంతినికేతన్ పాఠశాలలో సినీ హీరో సుమన్ జన్మదిన వేడుకలను సోమవారం షావోలిన్ శోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే అవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో షావోలిన్ శోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా సభ్యుడు నాంపల్లి కనకరావు, ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్ష చేస్తున్న నాయకులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్ష సోమవారం 130వ రోజు కొనసాగింది. ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు, మునుకుంట్ల మల్లయ్య, వెంకన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అందజేత



పౌష్టికాహారం అందజేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చండూరు : మండలంలోని గుండ్రపల్లి, ఉడతలపల్లి, పడమటి తాళ్ళకస్తాల, చొప్పరివారిగూడెం గ్రామాలకు చెందిన గర్భిణులకు సోమవారం చండూరు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, వైద్యులు రాజు, బ్లెస్సా తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

చండూరు(గట్టుప్పల్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ టీడీపీ నాయకులు సోమవారం తహసీల్దారు లావణ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నెట్టు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎండీ పాషా, గడ్డం కృష్ణయ్య, అంజయ్య, సుంకరి జంగయ్య, నర్సింహ, శ్రీకాంత్, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్ : ప్రజలకు కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ టీడీపీ నాయకులు సోమవారం నకిరేకల్‌లో తహసీల్దార్ ప్రసాద్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య, నక్క రాంబాబేష్, అంతటి రాములు, దొమ్మాటి సైదులు, నకిరేకంటి సతీష్, సునీల్, ఏడుకొండలు, లతీఫ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు భూ నిర్వాసితుల ధర్నా

మర్రిగూడ : శివన్నగూడ రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు శివన్నగూడ భూనిర్వాసితుల పోరాట సమితి అధ్యక్షుడు వల్లపు కేశవులుగౌడ్ తెలిపారు. రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులతోపాటు ముంపు గ్రామాల ప్రజలు ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

మునుగోడు : మండలంలోని చొల్లేడు గ్రామంలో ఈదమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం ఆ గ్రామ సర్పంచ్ జనిగల మహేశ్వరిసైదులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్ప అంతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఎల్లారెడ్డి, స్వాతి, కవిత, సంజీవరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు గిరికబావి గూడెంలో విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. కాలనీలో ఓ ఇంటి మూల మీద ఉన్న విద్యుత్ స్తంభం ఎప్పుడు గాలి దుమారానికి కూలుతుందోననే స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉన్నా ట్రాన్స్‌కో అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని కాలనీ ప్రజలు విమర్శిస్తున్నారు. విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నెరవేరనున్న నకిరేకల్ ప్రాంత ప్రజల కల



నిర్మాణంలో ఉన్న 100 పడకల వైద్యశాల భవనం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య (ఫైల్)

- శరవేగంగా 100 పడకల వైద్యశాల నిర్మాణం
- రూ.32 కోట్లతో పనులు
- ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపే వినియోగంలోకి తేవాలని యోచన

నకిరేకల్ : నకిరేకల్ ప్రాంత ప్రజల దశాబ్దాల కల మరి కొన్నినెలల్లో సాకారం కానుంది. నకిరేకల్‌లో 100 పడకల వైద్యశాల భవనం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆస్పత్రి నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తే నకిరేకల్ పట్టణంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే తొలి దశ పనులు పూర్తిచేసి ఓపీ సేవలను వినియోగంలోకి తెవాలని లక్ష్యంతో అధికారులు పనులను శరవేగంగా చేయిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రత్యేక చొరవతో మంత్రి జగదీష్‌రెడ్డి సహకారంతో 2022 జనవరి 21వ తేదీన నియోజకరవర్గ కేంద్రమైన నకిరేకల్ 30 పడకల వైద్యశాలను 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. ఈ ఆస్పత్రి అందరికి అందుబాటులో ఉండేలా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి వెంట రూ.32 కోట్లతో ఆరు ఎకరాల సువిశాలమైన స్థలంలో మూడు అంతస్తులతో నిర్మిస్తున్నారు. గత ఏడాదిలో చివరిలో ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయగా 2022లో డిసెంబర్ మాసంలోనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 10 మాసాలుగా నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం సాగాలని స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వారానికి రెండు దఫాలు సందర్శిస్తు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే మొత్తం మూడు అంతస్తులకుగాను గ్రౌండ్ ఫ్లోర్, మొదట అంతస్తులో ఏ, బీ, సీ బ్లాక్‌లు, రెండో అంతస్తులో ఏ, బీ బ్లాక్‌లు నిర్మిస్తున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి..

గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న ఈ వైద్యశాలను 1998లో 30 పడకల కమ్యూనిటీ వైద్యశాలగా మార్చారు. రోజుకు 300 నుంచి 450 మధ్య ఓపీ నమోదవుతోంది. ప్రతిరోజూ రోగులు అధికంగా వస్తున్నా అరకొర వసతుల మధ్య వైద్యం పొందుతున్నారు. ఓపీ చూడడం కోసం మూడు గదులు మాత్రమే ఉన్నాయి. ఒక్కో గదిలో ఇద్దరు చొప్పున ఓపీ చూడడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స సమయంలో సరైన వసతులు లేక నేలపైనే పడుకోబెట్టాల్సిన దుస్థితి నెలకొంది. ప్రాణాపాయ స్థితిలో ఈ వైద్యశాలకు చేరిన వారికి కృతిమ శ్వాస అందించే వెంటిలేటర్ సౌకర్యం లేదు. జాతీయ రహదారిపై అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి కొన ఊపిరితో ఇక్కడికి వచ్చి మెరుగైన వైద్యసేవలు అందక మార్గమధ్యలోనే అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రభుత్వ వైద్యశాలకు నకిరేకల్‌తో పాటు కట్టంగూర్, కేతేపల్లి, శాలిగౌరారం, తిప్పర్తి మండలాల ప్రజలు వైద్యం నిమిత్తం వస్తుంటారు. ఆస్పత్రిని విస్తరించాలని స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో మంత్రులు జగదీష్‌రెడ్డి, కేటీఆర్ సహకారంతో ప్రతిపాదనలు పంపగా సీఎం కేసీఆర్ 2021 సంవత్సరంలో ఆమోద ముద్ర వేశారు. అధికారికంగా 2022 జనవరి 21వ తేదీన రూ.32 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కొత్తగా 105 పోస్టులు మంజూరు

నకిరేకల్ 100 పడకల వైద్యశాల నిర్వహణ కోసం ఏటా రూ.6.35 కోట్ల బడ్జెట్ కేటాయిస్తూ జీవో నంబర్ 27ను ప్రభుత్వం జారీ చేసింది. 100 పడకల వైద్యశాలకు సరిపోయే మొత్తం 105 మంది సిబ్బందిని ప్రభుత్వం మంజూరు చేసింది. వీరిలో స్పెషల్ సివిల్ సర్జన్ పోస్టులు–10, సివిల్ అసిస్టెంట్ సర్జన్–15, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ –1, డిప్యూటీ సివిల్ సర్జన్–4, డిప్యూటీ డెంటల్ సర్జన్–1 చొప్పున వైద్యుల పోస్టులు మంజూరు చేసింది. నర్సింగ్ సూపరింటెండెంట్, హెడ్ నర్సు, ఫిజియోథెరపిస్టు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, కంటి వైద్యసహాయకులు, జూనియర్, సీనియర్ సహాయకులు ఉన్నారు. ఇప్పటికే 18 మంది వైద్యులు, 32 మంది వివిధ విభాగాల సిబ్బంది బదిలీల ద్వారా ఆస్పత్రిలో కొత్తగా విధుల్లో చేరి పాత భవనంలోనే వైద్య సేవలు అందిస్తున్నారు.

పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది



నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మాణంలో ఉన్న 100 పడకల వైద్యశాల భవనం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా చర్యలు తీసుకుంటున్నాం. వారానికి రెండుమార్లు పనులపై నే దృష్టి సారిస్తున్నా. 100 పడకల వైద్యశాలగా మార్చాలని మంత్రి జగదీష్‌రెడ్డి సహకారంతో మంత్రి కేటీఆర్ నేతృత్వంలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాను. మా కోరిక మేరకు సీఎం కేసీఆర్ ఆదేశాలతో నకిరేకల్‌కు 100 పడకల వైద్యశాలను మంజూరు చేస్తు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 100 పడకల వైద్యశాలతో నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు వైద్యసేవలు మ రింత అందుబాటులోకి రానున్నాయి. ప్రధానంగా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

– చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్యే, నకిరేకల్

బస్సుల సంఖ్య పెంచాలని వినతి

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి డిపో నుంచి నల్లగొండకు బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ సమాచార హక్కు కార్యకర్తలు సోమవారం డీఎం వెంకటమ్మకు వినతి పత్రం అందజేశారు. నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సమయానుకూలంగా బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అదేవిధంగా చెర్వుగట్టు దేవస్థానంకు వెళ్లే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అదనపు బస్సులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ షబ్బీర్ హుస్సేన్, అద్దంకి శ్రీశైలచారి ఉన్నారు.

మిర్యాలగూడలో పోటీకి అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి

మిర్యాలగూడ: కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్న తనకు ఈసారి పార్టీ తరఫున మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని టీపీసీసీ కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి కోరారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి 36వేల ఓట్లు సాధించానని అన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనలో అవిశ్రాంత పోరాటం చేశానన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ తరఫున మిర్యాలగూడ ఎమ్మెల్యేగా బరిలో నిలిచానని తెలిపారు. ఆ తర్వాత మారిన రాజకీయ సమీకరణాల్లో భాగంగా కాంగ్రెస్‌లో 2018 ఎన్నికల్లో పార్టీ టికెట్ ఆశించినప్పటికీ అధిష్టానం బీసీ సంఘం జాతీయ నాయకుడు ఆర్. కృష్ణయ్యకు సీటు కేటాయించిందన్నారు. అయినప్పటికీ తాను పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఆర్. కృష్ణయ్య తరఫున ప్రచారం చేశానన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని అధిష్టానం తనకు మిర్యాలగూడ ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అధిష్టానం నిర్ణయం మేరకు అభ్యర్థి ఎవరైనా గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. సమావేశంలో గాయం ఉపేందర్‌రెడ్డి, తమ్మన్న, డి. బాలాజీనాయక్, పెదమాం వీరస్వామి, తలకోల వెంకట్‌రెడ్డి, తలకొప్పుల సైదులు, కంచుకట్ల లింగయ్యయాదవ్, దండా ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.